
www.prajasakti.com

ప్రజాశక్తి



ఆదివారం 11 జూన్ 2023

5


తిరుపతి

మళ్లీ కొండపై విమానం చక్కర్లు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుమల కొండపై నుంచి తరచూ విమానాలు చక్కర్లు కొడుతున్నాయి. శుక్రవారం అన్నదాన సత్రంపై నుంచి విమానం వెళ్లగా, శనివారం శ్రీవారి ఆలయానికి అతి సమీపంలోని గొల్లమండపంపై నుంచి వెళ్లింది. ఎప్పుడో ఓసారి పొరపాటుగా వచ్చాయనుకుంటే ఏమోగాని... తరచూ విమానాలు చక్కర్లు కొట్టడంపై పండితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట ఎయిర్‌పోర్టు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా.. కేంద్రం నుంచి తమకు ఎలాంటి సూచనలు రాలేదని చెబుతున్నట్లు తెలుస్తోంది.

మోడీ పాలనలో ఆర్థిక పురోగతి

బిజెపిది సంక్షేమ పాలన, అవినీతిలో ఏపీ టాప్ : బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డా వ్యాఖ్య



జెపి.నడ్డాను కలువపూల మాలతో సన్మానిస్తున్న బిజెపి నాయకులు


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : బీజేపీది సంక్షేమాల పాలననీ, ప్రధాని మోదీ సారథ్యంలో దేశం ఆర్థిక పురోగతి సాధిస్తోందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా అన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రం అవినీతిలో దూసుకుపోతోందని విమర్శించారు. శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం బిజెపి ప్రభుత్వ తొమ్మిదేళ్ళ ఏళ్ల పాలన, సంక్షేమ పథకాలపై భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నరేంద్ర మోడీ పాలనలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ అభివద్ధి వైపు పరుగులు తీస్తోందన్నారు. గతంలో దేశ పేదరికం స్థాయి 22.3 శాతం ఉండగా అది మోడీ పాలనలో 2.1 శాతానికి పడిపోయిందని కితకిచ్చారు. దేశంలో అత్యంత పేదరికం కింద జీవిస్తున్న వారు కేవలం ఒక శాతం మాత్రమేనని ఉద్ఘాటించారు. కోవిడ్ కాలంలో కేంద్ర ప్రభుత్వం దేశప్రజలకు అండగా నిలబడిందనీ, 80 కోట్ల మందికి పీఎం గరీబ్ అన్న యోజన ద్వారా ఉచితంగా బియ్యం, పప్పులు, ఉప్పులు సరఫరా చేసిందని గుర్తు చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మూడు కోట్ల ఇంటి నిర్మాణాలు చేపట్టి పేదల సొంత ఇంటి కల నెరవేర్చిందని కొనియాడారు. జనధన్ పథకం ద్వారా 50 కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూరుస్తూ వారి ఖాతాల్లోకి నేరుగా నగదు జమచేస్తోందని అన్నారు. దేశ ఆర్థిక పరిస్థితుల్లో పదో స్థానంలో ఉన్న భారత్ మోడీ హయాంలో 7.6 శాతం వద్ధిరేటుతో ఐదో స్థానానికి ఎగబాకిందని వివరించారు. మొబైల్ ఫోన్ల తయారీ, ఎగుమతుల్లో అదోపాతంలో ఉన్న భారత్ నేడు 97 శాతం ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందన్నారు. ఆపిల్ ఫోన్ల తయారీ కూడా నేడు భారత్ లోనే జరుగుతుండడం ఇందుకు తార్కాణమన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్ ను రూ.300 కోట్లతో ఆధునికరిస్తున్నట్లు చెప్పారు. రూ.1400 కోట్లతో ఏర్పేడు వద్ద ఐఐటి, ఐజర్ సంస్థలు త్వరలోనే ప్రారంభానికి నోచుకోనున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే అవినీతి రాష్ట్రంగా చెప్పుకోవచ్చు అన్నారు. ల్యాండ్, ఇసుక, మద్యం, విద్య, వైద్యం అన్ని రంగాల్లో ఏపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ విమర్శించారు. ఏపీ సర్కార్ మద్యంతో వచ్చే ఆదాయం తోటే నడుస్తుందంటే జగన్ దిగజారుడు పాలనకు ఇంతకన్నా ఎమ్ నిదర్శనం కావాలన్నారు. ఏపీలో శాంతిభద్రతలు క్షీణించాయనీ, ప్రజలకు భద్రత కరువైందని వాపోయారు. అమరావతి ఏకైక రాజధాని అంటూ బిజెపి ప్రభుత్వం స్పష్టం చేయడమే కాకుండా, నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. అయితే అమరావతిలో ఎక్కడా అభివద్ధి జాడలేదనీ, అసలు రాజధానే లేకుండా నాలుగేళ్లు పాలన సాగించారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రాల అభ్యున్నతి కోరి కేంద్రం నిధులు మంజూరు చేస్తుంటే జగన్ సర్కార్ మాత్రం దారి మళ్లించి దోచుకుంటుందని ఆరోపించారు. జనసేనను, బీజేపీని వేరు చేసి చూడొద్దనీ, పవన్‌తో తమకు అన్నదమ్ముల అనుబంధం ఉందని, నిర్ణయాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ఏపీ ప్రభ్నుత్వ అవినీతిని ఎండగడతామని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యకుమార్ చెప్పారు. మాజీ కేంద్రమంత్రి పురందేశ్వరి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, సోమువీర్రాజు, జివిఎల్ నరసింహారావు, సీఎం రమేష్, భానుప్రకాష్, కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కబంధ హస్తాల్లో ప్రభుత్వాలు

కార్మికవర్గంపై పెరుగుతున్న దాడి : సిఐటియు అఖిలభారత కార్యదర్శి: కెఎన్ ఉమేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: దేశంలో కార్మికవర్గంపై దాడి పెరుగుతున్నదని వారిని కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కబంధహస్తాల్లో చిక్కుకుపోయాయని వారు చెప్పిందే వేదంగా తయారైందని సిఐటియు అఖిలభారత కార్యదర్శి కేఎన్ ఉమేష్ వ్యాఖ్యానించారు. సిఐటియు రాష్ట్ర తరగతులు శనివారం ఉదయం తిరుపతి నగరంలోని ఎంఆర్‌పల్లిలో ప్రారంభమయ్యాయి. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఈ తరగతులను ఉద్దేశించి కేఎన్.ఉమేష్ ప్రసంగించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ దాడి మరింత ఎక్కువైందని వివరించారు. లాభాలు కార్పొరేట్లకు, భారాలు కార్మికులకు అన్నట్టుగా తయారైందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం తీవ్రసంక్షోభంలో కూరుకుపోయిందని దానికి భారతదేశం మినహాయింపు కాదని, ఈ సంక్షోభభారాలను కార్పొరేట్ శక్తులు తప్పించుకునేందుకు కార్మికవర్గంపై దాడిని ప్రారంభించాయని, ఇది అన్ని స్థాయిల్లో కొనసాగుతున్నదని ఆయన వివరించారు. ఇటీవల కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి కోల్పోతున్న తీరును ఆయన సోదాహరణంగా వివరించారు. ప్రభుత్వ రంగాలలో ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, కొత్త ఉద్యోగాల సృష్టి లేకపోవడం, కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ వేగం కావడం రానున్న రోజుల్లో ప్రభుత్వరంగం అదశ్యం కావడానికి కొనసాగుతున్న చర్యలుగా ఆయన తెలిపారు. నూతన టెక్నాలజీ కార్పొరేట్ శక్తుల లాభాలకు తోడ్పడుతున్నదని, కార్మికవర్గ



తరగతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉమేష్

ఉపాధిని బలహీన పరిచేందుకు సాధనంగా తయారైందని ఉదాహరణలతో సహా వివరించారు. ప్రస్తుతం సాగుతున్న పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రత మరింత పెరుగుతుందని ఇది అన్ని స్థాయిల్లో ఉధతరూపం దాల్చుతుందని రానున్న రోజుల్లో సిఐటియు ఈ ఉద్యమాలకు అన్ని రకాలుగా నాయకత్వం వహించడానికి సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం ఈఅసంతప్తిని పక్కదోవ పట్టించడానికి కులం పేరుతో, మతం పేరుతో, ప్రాంతం పేరుతో, భాష పేరుతో, ఆహారం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నదని గుర్తు చేశారు. దేశంలోని యావత్ కార్మిక వర్గం గుర్తింపులతో నిమిత్తం లేకుండా పెద్ద ఎత్తున పోరాడాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులు కార్మికులను మోసపుచ్చే విధానాల్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నదని కొందరు తైనాతీ ఉద్యోగ సంఘాలు భజన చేస్తున్న తీరును ఆయన ఎండగట్టారు. మధ్యాహ్నం నుంచి జరిగిన మతోన్మాదం అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ప్రసంగిస్తూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ పెరుగుతున్న మతోన్మాద ప్రమాదం.. దానిని కార్పొరేటు శక్తులు బలపరుస్తున్న తీరును వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సిఐటియు రాష్ట్ర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తరగతులకు హాజరైన ప్రతినిధులు

భారీగా మొబైల్ ఫోన్లు రికవరీ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: చోరీకి గురైన మొబైల్ ఫోన్లను భారీగా రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్పి కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో సెల్‌ఫోను పోగొట్టుకున్న వారి కోసం ప్రత్యేకంగా మొబైల్ హంట్ వాట్సాప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 94906 17873 వాట్సప్‌కు వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు నాలుగు విడుతలుగా 780 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. వీటి విలువ రూ. 1,40,40,000 ఉందన్నారు. '5వ విడతలో నెల రోజుల వ్యవధిలోనే రికవరీ చేసిన 400 మొబైల్ ఫోన్లను (వాటి విలువ సుమారు రూ. 72,00,000)' బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 5 విడతలకు గాను మొత్తం 1,180 మొబైల్‌ఫోన్లు రికవరీ చేశారని, వాటి విలువ సుమారు రూ.2,12,40,000 ఉంటుందని తెలిపారు. ప్రజల ఎవ్వరిదైనా మొబైల్‌ఫోన్ పోతే పోలీస్ వారు ఏర్పాటు చేసిన వాట్సాప్ 94906 17873కు హాయ్, లేదా హెల్ప్ అని మెసేజ్ చేస్తే వచ్చే లింక్‌లో మీ వివరాలను పూరించాలన్నారు. పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా సెల్‌ఫోన్ బ్లాకు అవుతుందని, అలాగే పోగొట్టుకున్న ఫోన్‌ను త్వరితగతిన రికవరీ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అన్నారు. తిరుపతి వేగంగా అభివద్ధి చెందుతున్న నగరం ఇక్కడికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తూ ఉంటారని, సెల్ ఫోన్లు దొంగతనాలు కూడా జరుగుతూ ఉన్నాయని దీనిని గమనించి ఈ వాట్సాప్ నెంబరును ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. మొబైల్ పోగొట్టుకున్న వారు పోలీస్ స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయుటకు ఇబ్బందికర ఉన్నందున ఈ నెంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సెల్‌ఫోన్ రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ అధికారులకు, సైబర్ క్రైమ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించినారు. అడిషనల్ ఎస్పీలు అడ్మిన్ వెంకట్రావు, కులశేఖర్, క్రైమ్ విమల కుమారి, సైబర్ సిఐ రామచంద్ర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట ఫలితాలే ఎస్ఎం హైస్కూల్ లక్ష్యం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: విద్యార్థి దశ ఏదైనా విశిష్ట ఫలితాలు సాధించడమే ఎస్ఎం హైస్కూల్, ఇంగ్లీష్ మీడియం లక్ష్యమని ఆ స్కూల్ కరస్పాండెంట్ ఎస్ఎం.బాషా తెలిపారు. స్థానిక వెంకటరమణ లేఅవుట్‌లోని ఎస్ఎం హైస్కూల్‌లో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సగర్వంగా మా ఎస్ఎం హైస్కూల్ అని భావించే విధంగా, వారి ముఖాలలో చిరునవ్వు చూడాలనే ఒకే ఒక ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్నామని అన్నారు. గత 30 సంవత్సరాలుగా తల్లిదండ్రుల సూచనలు, సలహాలే మార్గదర్శకాలుగా బావించే ఏకైన విద్యాసంస్థ తమదన్నారు. ప్రతి సంవత్సరం ఎస్ఎస్‌సి ఫలితాల్లో ప్రభంజనం సృష్టిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల మన్నన పొందుతున్న నెంబరు వన్ విద్యాసంస్థ ఎస్ఎం హైస్కూల్ అన్నారు. 2023 ఎస్ఎస్‌సి ఫరీక్షా ఫలితాల్లో తమవిద్యార్థులు పిబి.అమ్రీన్ 573/600, కె.ప్రీతిక 567, బిఎస్ వాహిద మేహక్ 567, డి.దినేస్ 538, ఎస్.అబ్దుల్ రోహిత్ 534, ఎస్‌డి.దనిష్యా 504, డి.నిహారిక 468, జి.హేమశ్రీ 454, కె.కాచాయని 434, ఎస్.అమ్మజాన్ 430, ఎస్.తస్లీమ్ 415, ఎస్.మోహద్ యునీస్ 400, ఎన్.కీర్తన 348, ఎస్ఏఎం. ఉష్మాన్‌కూదరి 313, ఎస్.సాధిక్ 292, ఎం.మణికంఠ 289 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రస్తుతం స్కూల్ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. వివరాలకు 0877 2260968, 9866319268 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.



బి.అమ్రీన్ 573/600



కె.ప్రీతిక 567,



బిఎస్. వాహిద మేహక్ 567



కరస్పాండెంట్ ఎస్ఎం.బాషా

ప్రత్యేకతలు...

- పిల్లల బంగారు భవిష్యత్తు కోసం మంచి వాతావరణంలో ఉన్నత విద్యను అందించడం.
- విద్యాప్రమాణాలతో, పరిమిత సంఖ్యలో విద్యార్థులతో విద్యార్థి సంపూర్ణ అభివృద్ధికి కృషి చేసే ఆదర్శవంతమైన విద్యాసంస్థ.
- స్వీయ పర్యవేక్షణలో మీ పిల్లల విద్యా భవిష్యత్తు సురక్షితం.
- సొంత భవన సముదాయం.
- విద్యతో పాటు వినయం. విధేయత, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించడం.
- ప్రతి క్లాసుకు ఒకే సెక్షన్. ప్రతి సెక్షన్‌లో పరిమితి సంఖ్యలో విద్యార్థులు.
- పిల్లల విద్యాభివృద్ధిని పర్యవేక్షిస్తూ ఎల్లప్పుడు అందుబాటులో ఉండే డైరెక్టర్.
- హైస్కూల్ విద్యార్థులకు ప్రతిరోజు ఒక సబ్జెక్టులో పరీక్ష నిర్వహించడం.

'ఆది'లోనే 'వివాదాలు'


ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో 'బాహుబలి - 1' ప్రీరిలీజ్ ఈవెంట్ తిరుపతి తారకరామ స్టేడియంలో జరిగింది. సినిమా సైతం అంతేస్థాయిలో విజయవంతమయ్యింది. ఇదే సెంటిమెంట్‌తో 'ఆదిపురుష్' ప్రీరిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా తిరుపతిలో జరిగినప్పటికీ పొరబాట్లు విమర్శలకు తావిచ్చింది. ఈవెంట్‌కు లక్షపైనే అభిమానులు వస్తారని అంచనా ఉన్నా, ఏర్పాట్ల కల్పనలోనూ, పాస్‌ల జారీలోనూ నిర్వాహకులు విమర్శలను ఎదుర్కొన్నారు. తిరుపతి మీడియాను సైతం పక్కన పెట్టి రాష్ట్ర మీడియాను పిలిపించుకోవడం 'స్థానిక జర్నలిస్టులకు' కోపం తెప్పించింది. అంతేకాకుండా రెండో రోజు హీరోయిన్ కృతిసనన్ (ఆదిపురుష్‌లో జానకి పాత్రదారి) తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరిగి వెళు తుండగా దర్శకులు ఓంరౌత్ ఆమెకు 'హగ్' ఇచ్చి 'ముద్దు' పెట్టుకోవడం పెద్దఎత్తున దుమారం రేపింది.

తిరుమల పుణ్యక్షేత్రంలో శేషవస్త్రాలు ధరించి ఉన్న ఇద్దరూ ఆలయ మాడావీధుల వద్దనే ఈ విధంగా చేయడం ఏంటని భక్తులు ముక్కున వేలేసుకున్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి తిరుపతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో వీరి ఫొటోలు హల్‌చల్ చేశాయి. ఇక సినిమా ఈనెల 16న విడుదలవుతుందని ప్రకటించిన నేపథ్యంలోనూ పెద్దఎత్తున సెంటిమెంట్‌తో కూడా విషయాలు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దళితులు ఈ సినిమాకు రాకూడదని, చెప్పులు కూడా వేసుకోరాదని, మాంసం తినరాదని, మందు తాగి రాకూడదని... ఇలా అనేక విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జిల్లాఎస్పి పరమేశ్వర్‌రెడ్డి 'దళితులు రాకూడదనే' విషయం ఎక్కడా లేదని, ఇలాంటి విషయాలను ప్రచారం చేయరాదని హెచ్చరికలు జారీ చేశారు. ఇక కథ విషయానికి వస్తే కొంతమంది 'ఆదిపురుష్' సినిమా తీసినవారు 'రామాయణం పూర్తిగా చదివారా?' అంటూ విమర్శలు గుప్పించారు. రాముడుకు మీసం ఏంటి?, కృతిసనన్ జానకి పాత్రకు సూట్ కాలేదని అందంపైనా కామెంట్లు వినిపించాయి. ఏదిఏమైనప్పటికీ ఆదిపురుష్ ప్రీ ట్రైలర్ సందర్భంగా విమర్శలు ఎదుర్కొంది. ఇక సినిమా ఎలా జనంలోకి వెళుతుందనేది ఈనెల 16 వరకూ వేచి చూడాల్సిందే.

తూకం తప్పుతోంది..

- తూనికలు, కొలతల్లో మోసాలు
- పెట్రోల్ అమ్మకాల్లోనూ అదే తీరు
- పట్టించుకోని అధికారులు
- నష్టపోతున్న వినియోగదారులు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి ఆధ్యాత్మిక ప్రాంతం కావడంతో ఇక్కడ నిత్యం యాత్రికులతో కిటకిటలాడుతుంది. నగరంలో లీలామహల్ ప్రాంతంలో ఓ వ్యక్తి కిలో చికెన్ కొనుగోలు చేశారు. అనుమానం కలిగి క్యాంటీన్‌లో మరోసారి తూకం వేశాడు.. 100 గ్రాములు తక్కువ వచ్చింది.. వెంటనే వెళ్లి విక్రయిదారులు నిలదీశారు.. ఇక నుంచి తప్పు జరగకుండా చూసుకుంటామని ఆయన చెప్పుకోవచ్చాడు... అలాగే బండ్లవీధిలో ఓ వినియోగదారుడు సమీపంలో మామిడి పండ్లు కొనుగోలు చేశాడ.. ఇంటికి వచ్చి తూకం వేయగా రెండు వందల గ్రాములు తక్కువగా కనబడింది. లీలామహల్ వద్ద చేపల మార్కెట్లో స్థానికుడు రమేష్‌రెడ్డి చేపలు కొన్నాడు. మామూలు తక్కెడతో తూకం చేసిన అమ్మకందారుడు కిలో చేపలు ఇచ్చి రూ.101లు తీసుకున్నాడు. బరువు తక్కువగా "ఉందన్న అనుమానంతో మరోసారి తనిఖీ చేయించగా 150 గ్రాములు వచ్చింది.

ఇలా పండ్లు, కూరగాయలు, నిత్యావసరాలు గహనిర్మాణ సామాగ్రి, పెట్రోల్, డీజిల్ ఇతర వస్తువుల అమ్మకాల్లో భారీగా మోసాలు జరుగుతున్నాయి. ఒకవైపు కల్తీ.. మరోవైపు తూకంలో మోసాలతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీసం ప్రమాణాలు పాటించడం లేదు. ఇంకా పెట్రోల్ డీజిల్ అమ్మకాలు మరింత ఎక్కువ మోసాలు జరుగుతున్నాయి. కొన్ని పెట్రోల్ బంక్‌ల యాజమాన్యాలు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లతో ట్యాంపరింగ్ చేస్తున్నారు. లీటర్ పెట్రోల్ కొనుగోలు చేస్తే వంద నుంచి 250 మిల్లీమీటర్లకు పక్కదారి పట్టిస్తున్నారు. ఏరోజు కారోజు పెట్రోల్ డీజిల్ ధరలు ప్రదర్శించాల్సిన ఉన్నా ఎక్కడ అమలుతున్న దాఖలు లేవు. ఫిర్యాదు రావడం జరిగితే అధికారులు స్పందిస్తున్నారు.

ఫిల్టర్ పేపర్ ఉందా....

పెట్రోల్ నాణ్యత తెలుసుకునేందుకు బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. ఆ పేపర్ పై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరి అయిపోతే నాణ్యత కలిగినదిగా గుర్తించవచ్చు. అది మరకలు మిగిలిపోతే కల్తీ జరిగినట్టు నిర్ధారించవచ్చు ఈ విషయం చాలా మందికి తెలియదు.

ప్రామాణిక ముద్ర ఏది...

నిత్యావసరాలు ఇతర ఆహార పదార్థాలు, పండ్లు తూకల్లో మోసాల సంగతి చెప్పనక్కర్లేదు. తగ్గించే అమ్ముతున్నారు.. కొన్ని వస్తువులు ప్రామాణికముద్రతో విక్రయించాలన్న ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. వారపు సంతలు, రైతు బజార్లో, మార్కెట్లో సైతం రాళ్ళను తూనికలకు వినియోగిస్తున్నారు. ఇక ఆహారకల్తీ నియంత్రణ అధికారులు జాడ లేకుండా పోతుంది. స్వీట్ల దుకాణంలో తయారు చేసే ఆహారపదార్థాలపై తేదీలు ఎక్కడ ముద్రిస్తున్న దాఖలు లేవు.

సిమెంట్ బస్తాలోనూ తరుగు...

గహ నిర్మాణ సామాగ్రి అమ్మకాల్లో కూడా మోసాలు జరుగుతున్నాయి. ఒక్కో బస్తా వద్ద కనీసం కేజీన్నర తరుగు వస్తోంది. కంపెనీ సంగతి పక్కన పెడితే, కొంతమంది చోరులు బస్తాల్లోని రీప్యాకింగ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇనుము విక్రయించాలన్నా చాలామంది వ్యాపారులు విడిగా అమ్ముతున్నారు.

బంగారు భవిష్యత్తే రాయలసీమ లక్ష్యం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉన్నతమైన ఆశయాల్లోంచి ఊపిరిపోసుకున్న విశిష్ట విద్యాసంస్థ సురేంద్రారెడ్డి రాయలసీమ పబ్లిక్‌స్కూల్. సీమ విద్యార్థులకు అత్యుత్తమమైన, అత్యాధునిక విద్యను పంచడమే కాదు, సముజ్జ్వల కెరీర్లతో వెలుగొందేలా వారిని స్కూల్ దశ నుండి తీర్చిదిద్దడం లక్ష్యం రాయలసీమ ఆవిర్భవించిందని ఆ స్కూల్ చైర్మన్ వి.సురేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక అశోకనగర్‌లోని ఆ స్కూల్ ప్రాంగాణంలో 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలనే లక్ష్యసాధనలో నిరంతరాయంగా శ్రమిస్తూ 18 సంవత్సరాలుగా ప్రస్తానాన్ని సాగిస్తోందన్నారు. వేలాది తల్లిదండ్రుల కలల్ని నిజం చేస్తూ, విద్యార్థులను విజేతలుగా నిలుపుతూ నేడు 'రాయలసీమ' తన విద్యాప్రపంచాన్ని కాలేజీ స్థాయికి విస్తరించిందన్నారు. కిండర్ గార్డెన్, ప్రైమరీ, పబ్లిక్ స్కూల్స్, జూనియర్, డిగ్రీ కాలేజీలతో తన పరిధిని విస్తృతం చేసుకోవడమే కాదు, మదనపల్లిలోనూ స్కూల్ బ్రాంచ్‌లను నెలకొల్పిందన్నారు. మా ఆలోచనలకు, నిబద్ధతకు, కార్యాచరణకు ఈ విజయాలు నిలువెత్తు సాక్ష్యం, దీక్షాదక్షతలక ఉదార్యనికత తోడైతే వెల్లువయ్యే ఫలితాలకు సురేంద్రరెడ్డి రాయలసీమ అచ్చమైన ప్రతిభింబమన్నారు. కెజీ విద్యకు ప్రత్యేకమైన క్యాంపస్‌ను నెల్పామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన క్లాస్ రూమ్‌లు, ఏరికోరి ఎంచుకున్న ఆధ్యాపక బృందం, ఇండివిద్యువల్ అటెన్షనన్‌తో ప్రతి ఒకరిని స్ట్రాంగ్ ఇండివిద్యువల్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. సంస్థ స్థాపించిన తొలినాటి నుంచే అవార్డులు, రివార్డులు, ర్యాంకులు సాధించడం రాయలసీమ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు సర్వసాధారమైందని అన్నారు. 1999లో పదోవతరగతి విద్యార్థికి ప్రతిభ పురస్కారం, 2000లో రాష్ట్ర నాలుగోవ ర్యాంకు, 2001లో రాష్ట్రస్థాయి ఏడో ర్యాంకు, 2002లో ఏఐటిఎస్ఈలో ఆల్ ఇండియా రెండోవ ర్యాంకు, 2004లో అప్పటి విద్యాశాఖమంత్రిచే ప్రతిభ పురస్కారం, 2011లో, 2013లో, 2014లో పదో తరగతిలో అత్యంత ప్రతిభ చాటి అప్పటి సిఎం కిరణ్ కుమార్‌రెడ్డి చేతుల మీదగా గోల్డ్‌మెడల్ తీసుకున్నారని గుర్తుచేశారు. స్కూల్‌లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అన్నదాన్ని సార్థకం చేసేలా విద్యార్థులకు జీవితాంతం గుర్తుకొచ్చేలా స్కూల్ వాతావరణం ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 0877-2224903, 9494533339 నెంబరను సంప్రదించాలని కోరారు.



ప్రత్యేకతలు...

- ప్రతి విద్యార్థిపై ఇండివిద్యువల్ అటెన్సన్, ప్లేవే ఎక్విప్‌మెంట్.
- విజువల్ బేస్ట్ ఇంటరాక్టివ్ టీచింగ్, విద్యార్థి సమగ్ర అభివృద్ధిపై దృష్టి.
- ప్రాజెక్టు బేస్ట్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి.
- అత్యాధునిక టీచింగ్ ఎయిడ్స్‌తో బోధన, స్లోలెర్నర్స్‌పై అదనపు శ్రద్ధ.
- అధునూతన సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు. ఫీల్డ్ ట్రిప్స్, సెమినార్స్ నిర్వాహణ.
- స్ట్రెస్ ఫ్రీ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం. వాత్సల్యంతో మెలిగే అధ్యాపక బృందం.
- జూనియర్ కాలేజీ విద్యతో పాటు ఎంసెట్, ఐఐటి(జెఈఈ) ప్రత్యేక శిక్షణ.
- హోటల్‌మేనేజ్‌మెంట్ కోర్సుకు ప్రత్యేక ల్యాబ్‌లు.
- ప్రభావవంతమైన ప్రాక్టికల్ ట్రైనింగ్.
- అనుభవజ్ఞులు, నిష్ణాతులైన హోటల్ మేనేజ్‌మెంట్ గెస్ట్ ఫ్యాకల్టీ.
- ఇండోర్, అవుట్‌డోర్ స్పోర్ట్స్‌కు ప్రోత్సహం.
- యోగా, మెడిటేషన్ క్లాసులు.
- డ్యాన్సు, మ్యూజిక్ అంశాల్లో శిక్షణ.
- హాస్టల్‌కు పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం రోగుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ గూడూర్ వెస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఎస్ కే షారీనా మాట్లాడుతూ పేషంట్ల సౌకర్యార్థం మంచినీటి వసతిని కల్పించిన రోటరీ క్లబ్‌కు, ఆర్వో ప్లాంట్ దాత శ్రీకంటి రామ్మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, ప్రెసిడెంట్ ధనుంజయ రెడ్డి, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్, రొటేరియన్స్ వాసు గౌడ్, బొమ్మిడి శ్రీనివాసులు,విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరానికి స్పందన



ప్రజాశక్తి-రేణిగుంట: గొల్లపల్లి గ్రామంలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. రేణిగుంట ఏరియా వెటర్నరీ డాక్టర్ స్రవంతి సహకారంతో శనివారం సేవలు అందించారు. కార్యక్రమంలో క్లస్టర్ లీడర్లు , ట్రస్టీ సుబ్బరత్నమ్మ, ట్రస్టు సిబ్బంది, ప్రాజెక్ట్ ఆఫీసర్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



ప్రజాశక్తి-కేవీబీపురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దూరమవుతాయని మండల వైద్యాధికారి డాక్టర్ వాణి అన్నారు. మండలంలోని పాతపాలెం గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. మందులు అందించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

దళితులపై తప్పుడు కేసులు

ప్రజాశక్తి-గూడూరు: బాలాయపల్లి మండలంలో తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు విన్నవించారు. పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, పుచ్చలపల్లి హరిణి, యల్లంటి జనార్ధన్ రెడ్డి, పుచ్చలపల్లి వెంకటరామిరెడ్డిలు పేదలకు అండగా నిలిచిన గజ్జల రాజగోపాల్‌ను దారి కాచి నరికేస్తానని బెదిరించారని వాపోయారు. కార్యక్రమంలో గూడూరు పట్టణ కార్యదర్శి జోగి శివకుమార్, కె.వి.పి.యస్.నాయకులు ప్రసాద్, యస్.సురేష్, సి.ఐ.టి.యు ఆటో కార్మిక సంఘం జిల్లా నాయకులు బి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల సేవలో పవిత్ర రెడ్డి

ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని చిన్న కనపర్తి హరిజనవాడ లో శ్రీసీత,లక్ష్మణ,హనుమంత్ సమేత శ్రీరామ చంద్రమూర్తి బింబ ప్రతిష్ట కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి పాల్గొని సీతారాములను శనివారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపి, ఎంపీటీసీ సుబ్రమణ్యం, మణి నాయుడు, చంద్రయ్య నాయుడు, నరసింహ నాయుడు, సురేష్, చంద్ర, సుబ్రమణ్యం, రాధ, శ్రీరాముల రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అలయ్య, భాస్కర్, మణి, దీపక్ రెడ్డి, నాగమణి, వెంగాల్ రావు, తీర్థరామన్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): మానసికంగా, శారీరకంగా దఢంగా ఉండాలంటే జర్నలిస్టులకు క్రీడలు ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జోనల్స్ క్రికెట్ టోర్నీ జర్సీని శనివారం తిరుపతిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, శ్రీ రమాదేవీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ డీబీ శశిధర్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ జర్నలిస్టులు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయం అన్నారు. నిత్యం పనిఒత్తిడిలో జర్నలిస్టులు నలిగిపోతుంటారన్నారు. పనిఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. జర్నలిస్టు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రమాదేవి ఆసుపత్రి యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. సామాజిక అంశాల్లోనూ వారు ముందుంటారని కొనియాడారు. శ్రీరమాదేవి ఆసుపత్రి అధినేత డాక్టర్ డీబీ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు తాము ఎప్పుడూ సహాయసహకారాలు అందించేందుకు ముందుంటామన్నారు. క్రికెట్ జర్సీ, ట్రోఫీ కప్పులను అందించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి జిల్లా జట్టు టోర్నీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శివశంకర్, జిల్లా అధ్యక్షుడు, కెప్టెన్ పులిగోరు శ్రీనివాసులు, మేనేజర్ విజయ్ యాదవ్, సతీష్, మనోహర్, శేఖర్, శీను, ఆసుపత్రి సిబ్బంది చక్రి పాల్గొన్నారు.



మహిళలకు బీమా చేయించలేని ప్రభుత్వం



ప్రజాశక్తి-రామచంద్రాపురం: వైసీపీ మహిళలకు బీమా చేయించలేని ప్రభుత్వమని.. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెలుగు సంఘాలను ప్రారంభించి వారి అభివృద్ధికి కృషి చేశారని.. చంద్రన్న బీమా చెల్లిస్తూ భరోసా కల్పించిందని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి చినబాబు తెలిపారు. పొదుపు సంఘాల పైన భారం పడకుండా బీమా పథకాన్ని వర్తింప చేస్తూ వచ్చిందని, 2019 లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చంద్రన్న బీమాను పక్కన పెట్టి వైఎస్ఆర్ బీమాగా నామకరణం చేసి ప్రభుత్వం ఎలాంటి బీమా కల్పించడానికి చొరవ తీసుకోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మరొకసారి వైసిపి మహిళల్ని మోసగించడానికి తన జిత్తులమారి తనాన్ని ప్రదర్శించడానికి పూనుకుందని వివరించారు.

చిగురించిన ఆశలు..!

- గూడూరు మార్కెట్లో నిమ్మకాయలకు గిరాకీ
- బస్తా కాయలు రూ.2 వేలకు పైగా అమ్మకాలు
- మళ్లీ పెరగనున్న సాగు విస్తీర్ణం
- దేశంలోనే గూడూరుకు ప్రత్యేక ఖ్యాతి
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ప్రజాశక్తి-గూడూరు రూరల్

గూడూరు నిమ్మకాలకు దేశ, విదేశీ మార్కెట్లో మంచి డిమాండు ఉంది. దీంతో రాష్ట్రంలోనే గూడూరు ప్రత్యేక ఖ్యాతిని సంతరించుకుంది. గూడూరు నుండి ఢిల్లీ వరకు నిమ్మ కాయల ఎగుమతులు సాగుతున్నాయి. గూడూరు, పొదలకూరు, రాపూరు , మనుబోలు, డక్కిలి, చిల్లకూరు, సైదాపురం మండలాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో రైతులు నిమ్మసాగు చేస్తున్నారు. గూడూరు నిమ్మ మార్కెట్ దేశంలోనే ఎగుమతికి అగ్రగామిగా ఉంది. ఈ ప్రాంతం నుండి తరచూ 100 లారీల నిమ్మకాయలు దేశంలోని వివిధ ప్రధాన పట్టణాలకు ఎగుమతి అయ్యేవి. అయితే పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలలోనూ రైతులు నిమ్మసాగు చేపట్టారు. అలాగే రాష్ట్రంలోని కడప, రాయచోటి, రైల్వేకోడూరు, కష్ణా జిల్లా ఏలూరులోనూ నిమ్మమార్కెట్లు వెలిశాయి. దీంతో గూడూరు నిమ్మకాయలకు కొంత గిరాకీ తగ్గింది. గతంలో 80 కేజీల బస్తా లెక్కన నిమ్మ అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు కేజీ లెక్కన నిమ్మ అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కేజీ నిమ్మకాయలు రైతుల నుంచి కిలో రూ.30 లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కడుపు కాలిన రైతులు తెచ్చిన నిమ్మబస్తాలను అడిగిన రేటుకి ఇచ్చి వెళ్లిపోయిన సంఘటనలు ఉన్నాయి. గత కొంత కాలంగా యాబై కేజీల బస్తా రూ.1700 లకు అమ్ముతున్నారు. అందులో రూ.150 డీలర్లకు కమీషన్ ఇవ్వాలి. గ్రామాల నుంచి తరలించిన నిమ్మకాయలకు లగేజ్ రూ.50 ఖర్చు అవుతుంది. కొంత మంది రైతులు రెండేళ్ల నుంచి కరోనా కారణంగా ధరలు పెరగకపోవడంతో రైతులు తమ పంథాను మార్చుకున్నారు. నిమ్మ చెట్లను తొలగించి మామిడి, చౌక చెట్లను పెంచడం ప్రారంభించారు. ఫలితంగా గూడూరు డివిజన్‌లో కనీసం పదివేల ఎకరాలలో నిమ్మసాగు కనుమరుగైంది.

ప్రస్తుతం నిమ్మ మార్కెట్ ఊపందుకొంది. కనీవినని రీతిలో నిమ్మకాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. యాబై కేజీల బస్తా ప్రస్తుతం రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు నాణ్యతను బట్టి అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో మళ్లీ రైతులు నిమ్మసాగు వైపు మక్కువ చూపుతున్నారు. మార్కెట్‌కు మళ్లీ పూర్వ వైభవం వస్తుందని రైతులు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీలో ఉద్యోగులకు మోసం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అధికారంలోకి రాగానే కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ ఇస్తామని చెప్పిన వైసిపి ప్రభుత్వం నేడు మాట తప్పి మోసం చేస్తోందని చిత్తూరు పార్లమెంటరీ టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు రావిళ్ల మాధవ నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన పుత్తూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షమందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులు ఉంటే, కేవలం 10,117 మందినే రెగ్యులైజ్ చేస్తూ ఉత్తర్వులివ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం యాదవ్, కార్యదర్శి నిరంజన్ రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి బాలకష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22న వాచీలు టెండర్ కమ్ వేలం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను ఈనెల 22న టెండర్ కమ్ వేలం వేయనున్నట్లు టిటిడి పిఆర్‌వో డాక్టరు టి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్ కంపెనీల వాచీలున్నాయి. కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 10 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877- 2264429 నంబరులో కార్యాలయం వేళల్లో కానీ, టీటీడీ వెబ్‌సైట్ ద్వారా కానీ వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

టీడీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మురళీ



ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిగా పూతలపట్టు గ్రామానికి చెందిన గొడుగుచింత గ్రామానికి చెందిన జర్నలిస్టు కలికిరి మురళీని రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చం నాయుడు ఆదేశాల మేరకు నియమించినట్లు మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి , పూతలపట్టు నియోజవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్ తెలిపారు. కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి మురళిని గెలిపించాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సూచించారు. మురళి ప్రస్తుతం తిరుపతి కేంద్రంగా ఓ టీవీ ఛానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు.

చేనేత వస్త్రాలతో వెంకటగిరికి కీర్తి




ప్రజాశక్తి-వెంకటగిరి: ప్రపంచ స్థాయిలో వెంకటగిరికి చేనేత వస్త్రాలతో ప్రత్యేక కీర్తి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం వెంకటగిరి 6వ వార్డు ఎన్‌టీఆర్ కాలనీలో భావనా ఋషి క్లస్టర్ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివద్ధికి కషి చేస్తున్నట్లు తెలిపారు. భావనా ఋషి క్లస్టర్ అభివద్ధికి మొదటి విడతగా మంజూరైన నిధులతో లబ్ధిదారులకు చేనేత పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ నక్క భానుప్రియ, ఆరో వార్డు కౌన్సిలర్ జానకి రామయ్య, ఏడో వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి, చేనేత రాష్ట్ర కమిటీ సభ్యులు నక్క వెంకటేశ్వరరావు, వైసీపీ సీనియర్ నాయకులు లక్కనేని కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం



ప్రజాశక్తి-క్యాంపస్: నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నిర్వహించి విద్యార్థుల సమస్యల పక్షాన నిలబడే నిజమైన నాయకుడు ప్రసాద్ రెడ్డి అని జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ పేర్కొన్నారు. వైయస్సార్ విద్యార్థి సంఘం రాయలసీమ జిల్లాల ఇన్చార్జి అధ్యక్షుడు, విద్యార్థి నాయకుడు వి.హరి ప్రసాద్ రెడ్డి 43 వ జన్మదినోత్సవాన్ని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పరిపాలన భవనం ఎదుట వైయస్సార్ విద్యార్థి విభాగం యూనివర్శిటీ ఇన్‌ఛార్జి మురళీధర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కిషోర్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీరేంద్ర వర్మ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చేసే నిజమైన నాయకుడు హరిప్రసాద్ రెడ్డి అన్నారు. అభయ క్షేత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశ్చిమ రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జి చక్రధర్, ఎన్.ఎం.ఆర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివానంద రెడ్డి, విద్యార్థి నాయకుడు వంశీధర్ రెడ్డి, హాస్టల్ ఉద్యోగుల సంఘం నాయకుడు లోకేష్, స్టేట్ ఫుడ్ కార్పొరేషన్ నెంబర్ జక్కంపూడి కిరణ్, చిత్తూరు జిల్లా యూత్ వింగ్ ప్రెసిడెంట్ హేమంత్ కుమార్ రెడ్డి, శ్రీహరి రెడ్డి, సదాశివ, కె.వి.ఆర్, హరి ,నారయ్య, చందు, సుధాకర్ రెడ్డి, విద్యార్థులు, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 63వ జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సినీ, రాజకీయ రంగంలో బాలకృష్ణ మరింత ఎత్తుకు ఎదగాలని నాయకులు ఆకాంక్షించారు. దశరదాచారి, చలపతి నాయుడు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో టీడీపీ అధ్యక్షులు యం.సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో నందమూరి బాలకష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

గూడూరు: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ జన్మదిన వేడుకలను గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గూడూరులో ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. అలాగే గూడూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏసుపాక పెంచలయ్య, తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా కార్యదర్శి, గూడూరు మాజీ కౌన్సిలర్ గుండాల భారతిల జన్మదినం కావడంతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసరావు, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి బిల్లు చెంచు రామయ్య, తిరుపతి పార్లమెంటు క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, మాజీ కౌన్సిలర్ వాటంబేటి శివకుమార్, తెలుగు యువత నాయకులు వేముల సునీల్, సందీప్, నాయకులు సుబ్బయ్య పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: తిరుమలలో అఖిలాండం వద్ద సినీ నటుడు నందమూరి బాలకృష్ణ 63వ జన్మదిన సందర్భంగా శనివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ 630 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బేడీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆయన పేరుతో అర్చన నిర్వహించారు. శ్రీధర్ వర్మ, బాలకృష్ణ అభిమాని సుబ్రమణ్యం, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీలో కరెంటు బిల్లు తాకితే షాక్..!



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ పాలనలో కరెంట్ బిల్లు తాగితే షాక్ కొడుతోందని.. ఉచిత విద్యుత్తుకు మీటర్లు ఎందుకని నగరి నియోజవర్గం టిడిపి ఇన్చార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. వడమాలపేటలో ఆయన టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.టీడీపీ హయంలో రాష్ట్రంలో విద్యుత్‌పరంగా మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉండేదని, అయితే నేడు వైసీపీ పాలనలో విద్యుత్ బిల్లు పట్టుకుంటే షాక్ కొడుతోందని మండిపడ్డారు. విద్యుత్ లోటు రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టులోని విద్యుత్ ఉపయోగించుకోలేదన్నారు. షిరిడీ సాయి కంపెనీకు మీటర్ల కొనుగోలు కాంట్రాక్ట్ ఇచ్చి, ప్రజా సొమ్ము దోచుకుంటున్నారని తెలిపారు. కంపెనీలు సైతం వైస్ జగన్, అవినాష్‌రెడ్డి బినామీలదని ఆరోపించారు. రాష్ట్రాన్ని పూర్తిగా తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొల్లగొడుతున్నారన్నారు. విద్యుత్ మీటర్లతో రైతన్నల కడుపుకొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జానా వెంకటయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి హేమావతి, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి డి.ధనుంజయనాయుడు, పార్లమెంటరీ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, శేషాద్రి యాదవ్, వెంకటేశ్వరరావు, బత్తయ్య పాల్గొన్నారు.

గూడూరు: రాష్ట్రంలో ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని గూడూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెంచిన ఛార్జీలను తగ్గించకుంటే విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ పై చేసిన విమర్శలను సెల్ఫోన్లో వీడియోలను మీడియాకు చూపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల కాలంలో 9 సార్లు కరెంటు ఛార్జీలు, మూడుసార్లు ఆర్టీసీ బస్ ఛార్జీలు, ఆస్తి పన్ను, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. పెట్రోల్, డీజల్ ధరలు దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో అధికంగా ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, తిరుపతి పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఇజ్రాయేల్ కుమార్, మాజీ కౌన్సిలర్ వాటంబేటి శివకుమార్, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఏసుపాక పెంచలయ్య, తెలుగు యువత నాయుకులు వేముల సునీల్, గుండాల సందీప్, సుబ్బయ్య, నాయుకులు తదితరులు పాల్గొన్నారు .

రేషన్ బియ్యం స్వాధీనం



ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలం కలగుంట నుంచి నేలపట్టుకు వెళ్లే దారిలో శనివారం అక్రమంగా 55 ప్లాస్టిక్ గోతాల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తిరుపతి విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


రోడ్డు ప్రమాదంలో డిజిటల్ అసిస్టెంట్ మృతి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం సీతారామపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సచివాలయ ఉద్యోగిని మృతి చెందింది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు వెంకటగిరి నుండి తిరుపతికి మామిడికాయల లోడ్డుతో మినీ లారీ వెళుతోంది. ఏర్పేడు సమీపంలోని సీతారంపేట వద్ద బ్రేకులు ఫెయిల్ అయ్యి ఎదురుగా వస్తున్న కారును.. ఆ పక్కనే వెళుతున్న ద్విచక్రవాహనాన్ని సైతం ఢీకొంది. ప్రమాదంలో టూవీలర్ నడుపుతున్న లలిత (డిజిటల్ అసిస్టెంట్, వడమాల పేట) అక్కడికక్కడే మతి చెందింది. లలిత వడమాలపేట నుండి శ్రీకాళహస్తికికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదం జరిగింది. లలిత శ్రీకాళహస్తిలోని బాలాజీ నగర్ కాలనీ వాస్తవ్యురాలు. లలిత సోదరుడు ఎస్. క్రాంతికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లలిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు లారీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఎనిమిది మంది స్మగ్లర్లపై కేసులు

- తప్పించుకున్న బడా స్మగ్లర్ తాంజి



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేట పోలీసులు చేపట్టిన దాడుల్లో బడా స్మగ్లర్ తాంజి తప్పించుకున్నాడని భాకరాపేట సీఐ తులసిరామ్ తెలిపారు. స్థానిక చిట్టేచెర్ల పంచాయతీ, భూతంవారిపల్లి వద్ద వాహనాల్లో ఎర్రచందనాన్ని అక్రమరవాణా జరుగుతుందని తమకు రహస్య సమాచారం అందిందని.. భాకరాపేట ఎస్సై ప్రకాష్ కుమార్ సిబ్బందితో వెళ్లగా సమాచారం ప్రకారమే రెండు వాహనాలు వచ్చాయన్నారు. తమ సిబ్బంది అప్రమత్తమై చుట్టుముట్టి ఎనిమిది మంది తమిళ స్మగ్లర్లను పట్టుకొని విచారించామని.. బడా స్మగ్లర్ తాంజి, అతని డ్రైవర్ తప్పించుకొన్నారు. ఘటనా స్థలంలో ఉన్న రెండు వాహనాల్లో ఒకదానిలో దుంగలు, మరో వాహనంలో రంపాలు, గొడ్డల్లు, కొడవల్లు ఉన్నాయని.. వాహనాలతో సహా వీటి విలువ రూ.22 లక్షలు ఉంటుందన్నారు. తాంజి అనే బడా స్మగ్లర్‌పై తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాలలో సమారు 30 ఎర్రచందనం కేసులు నమోదయ్యాయన్నారు. పట్టుబడ్డ ఎనిమిది మంది తమిళ స్మగ్లర్లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

నెల్‌కాస్ట్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం




ప్రజాశక్తి - ఓజిలి : నెల్ కాస్ట్ పరిశ్రమలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఓజిలి మండల పరిధిలోని పెద్దపరియ నెల్ కాస్ట్ పరిశ్రమలో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే శనివారం విధులకు హాజరైన గుర్వబేస్ , రాజేంద్ర సింగ్, వికాష్ వారన్ బాయిలర్‌లోని చెత్తను తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బయిలర్‌లో నుంచి మంటలు చెలరేగడంతో ముగ్గురికి శరీర భాగాలు కాలి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను యాజమాన్యం చెన్నై ఆసుపత్రికి తరలించి వైద్య సేవలను అందిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి విచారిస్తున్నారు. నెల్ క్యాస్ట్ ప్రమాదం ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సీఐటీయూ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ చాపల వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు ఎస్.ముకుందా పరిశీలించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: స్కూల్ స్వీపర్స్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, స్కూల్ స్వీపర్స్ జిల్లా బాధ్యులు నాగరాణి, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎన్‌డి.రవి చంద్రశేఖర్‌రెడ్డి హాజరైయారు. ఉద్యోగుల ఈనెల 8వ తేదీ విజయవాడలో స్కూల్ స్వీపర్స్ రాష్ట్రమహాసభలు జరుగుతున్నాయి. ఈ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్క కార్యవర్గ సభ్యులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జ్యోతి, రోజా, పార్వతి, రాజమ్మ, చెంగమ్మ, దేవి, స్కూల్ స్వీపర్స్ జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలలో ప్రతిభ



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: న్యూఢిల్లీలో ఈనెల 6 నుండి 12వ తేదీ వరకు నిర్వహించిన 66 జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీలలో తిరుపతికి చెందిన హాసనపురం రెడ్డి ఈశ్వర్ పార్టిసిపేట్ పత్రాన్ని అందు కున్నారు. జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలలో స్విమ్మింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున రెడ్డి ఈశ్వర్ పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన స్విమ్మింగ్‌లోని డైవింగ్ విభాగంలో క్రీడాకారులతో రెడ్డిఈశ్వర్ పోటాపోటీగా చివరకు పార్టిసిపేట్ పత్రాన్ని అందుకున్నారు. శనివారం రోజున పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ దీపక్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చేతులమీదుగా అందుకున్నారు. రెడ్డిఈశ్వర్ తిరుపతి నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున జాతీయస్థాయి పోటీలలో పాల్గొనడం పట్ల పలువురు క్రీడాసంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు రెడ్డిఈశ్వర్‌ను అభినందించారు. రెడ్డి ఈశ్వర్ గత 15 సంవత్సరాలుగా పలు క్రీడా విభాగాలలో జిల్లా, రాష్ట్ర స్థాయి పతకాలు ఎన్నో సాధించారు.